

పోషణ యాజమాన్యం కీలకం

పంటల సాగులో పోషణ యాజమాన్యం కీలకమని జిల్లా వ్యవసాయాధికారి నందు తెలిపారు. 8లో



ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

మన్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వాతావరణంలో మార్పులతో అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. 8లో




ఆసరాతో ఆర్థికాభివృద్ధి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆసరాతో పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాల్గుణ అన్నారు. 8లో

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- జిల్లాలో మావోయిస్టుల కదలికలు తక్కువే
- నిరంతరం గంజాయి నిర్మూలన కార్యక్రమాలు
- గిరిజనాభివృద్ధికి పోలీసుశాఖ భాగస్వామ్యంతో చర్యలు
- ఎస్పీ తుహిన్ సిన్హా



జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న తుహిన్ సిన్హా

సాక్షి,పాడేరు: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా ఎస్పీగా ఆయన తన కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ ఎస్పీగా పనిచేసిన సతీష్‌కుమార్ కాకినాడకు బదిలీ అవడంతో ఆయన స్థానంలో పాడేరు ఏఎస్పీ (అడ్మిన్)గా పనిచేస్తున్న 2017 బ్యాచ్‌కు చెందిన తుహిన్ సిన్హాను ప్రభుత్వం నియమించింది. జిల్లా ఏర్పడిన తరువాత రెండవ ఎస్పీగా నియమితులైన తుహిన్ సిన్హా ముందుగా ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని దర్శించుకుని,అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ సుమిత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి,పుష్పగుచ్ఛం అందజేశారు.ఎస్పీకి కలెక్టర్ అభినందనలు తెలిపారు.అక్కడ నుంచి మధ్యాహ్నం 2గంటలకు ఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2017 ఐపీఎస్ బ్యాచ్ చెందిన తనకు ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో తొలి పోస్టింగ్ విశాఖపట్నంలోని గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండర్‌గా లభించిందని చెప్పారు. నర్సీపట్నం ఏఎస్పీగా, కర్నూలులో అడిషనల్ ఎస్పీ (ఎస్‌ఈబీ అధికారి)గా పనిచేశానన్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తరువాత ఏఎస్పీ అడ్మిన్‌గా నియమితులైన తాను 10నెలల పాటు పనిచేశానని, అనంతరం ఎస్పీగా ఇక్కడే ప్రభుత్వం నియమించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాలపై పూర్తి అవగాహన ఉందని, ఏజెన్సీలో సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తానన్నారు. కలెక్టర్,ఇతరశాఖల అధికారుల సహకారంతో గిరిజనాభివృద్ధిలోను పోలీసుశాఖ భాగస్వామ్యం అవుతుందని చెప్పారు. మావోయిస్టుల కదలికలు తక్కువగానే ఉన్నప్పటికీ గతంలో పనిచేసిన పోలీసు అధికారుల మాదిరిగానే మావోయిస్టుల కార్యకలపాల నిరోధాన్ని చాలెంజ్‌గా తీసుకుంటామని ఆయన తెలిపారు. ఏవోబీలో సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్ పార్టీలతో నిరంతరం తనిఖీలు ఉంటాయన్నారు. పాడేరుతో పాటు జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసు విభాగాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

గంజాయి నిర్మూలన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, గత ఏడాది 7,500 ఎకరాలలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు పోలీసుశాఖ సహకరించిందని తెలిపారు. ఈఏడాది కూడా మారుమూల గ్రామాల గిరిజనులకు పోలీసుశాఖ అన్ని విధాల సహకరిస్తుందని,గిరిజన యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు.

గిరిజనుల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలు

- బాధ్యతలు స్వీకరించిన ఐటీడీఏ పీవో అభిషేక్
- పీవోకు అభినందనల వెల్లువ



బాధ్యతలు స్వీకరిస్తున్న అభిషేక్

సాక్షి,పాడేరు: ఐటీడీఏ పరిధిలో గిరిజనుల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలు అందిస్తానని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. పాడేరు సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న అభిషేక్‌ను ప్రభుత్వం పాడేరు ఐటీడీఏ పీవోగా ఇటీవల నియమించింది. ఇక్కడ పీవోగా పనిచేసిన గోపాలకృష్ణను అమరావతిలోని ల్యాండ్ సర్వే సెటిల్మెంట్ విభాగానికి బదిలీ చేసింది. దీంతో పీవోగా బుధవారం వి.అభిషేక్ బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ రెండేళ్లుగా పాడేరు సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్నానని, తనపై ఉన్న నమ్మకంతో ప్రభుత్వం పాడేరు ఐటీడీఏ పీవోగా నియమించిందని చెప్పారు. ప్రభుత్వ నమ్మకం, ఆశయాలకు తగ్గట్టుగా గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గిరిజన ప్రాంతాలపై మంచి అవగాహన ఉందన్నారు. అనంతరం ఐటీడీఏ గార్డెన్‌లో అధికారులతో కలిసి పీవో అభిషేక్ మొక్కలు నాటారు. ఐటీడీఏపీవోగా బాధ్యతలు స్వీకరించిన వి.అభిషేక్‌కు పలువురు అధికారుల అభినందనలు తెలిపారు.ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకరరావు,వెంకటేశ్వరరావు,ఏవో హేమలత,డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు,కాఫీ ఏడీ అశోక్,డీఆర్‌డీఏ పీడీ మురళీ,ఎస్‌డీసీ శర్మ,ఐటీడీఏ కేర్ అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు.

అడిగితే అమ్మలా సేవలు



ఇంజరిలో సభకు భారీగా హాజరైన గిరిజనులు



మాట్లాడుతున్న ఏఎస్పీ శివ కిశోర్

- చింతపల్లి ఏఎస్పీ శివకిశోర్

పెదబయలు: సాయం కోసం సంప్రదిస్తే అమ్మలా సేవలు అందించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని చింతపల్లి ఏఎస్పీ శివ కిశోర్ అన్నారు. పెదబయలు మండలం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం ఇంజరి సచివాలయం పరిధిలో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో యువహో, సంజీవని కార్యక్రమాల్లో భాగంగా బుధవారం వాలీబాల్ టోర్నమెంట్,భారీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఏఎస్పీ శివ కిశోర్ మాట్లాడుతూ ఇంజరి అంటే తుపాకుల మోతలు, మందు పాతరలు, గంజాయి,నక్సలిజం మాత్రమే గుర్తుకొస్తుందని, ఇప్పుడు ఇంజరి అంటే ఉన్నత విద్యావంతులు గుర్తుకొచ్చేలా మార్పు రావాలన్నారు. ప్రతి కుటుంబంలో చదువుల విప్లవం, వ్యవసాయ విప్లవం సాధించాలని సూచించారు. చెడు మార్గాలపైపు యువత పయనించరాదన్నారు. గతంలో ఇంజరికి కాలినడక,గుర్రాలపై వచ్చే వారని, ఇప్పుడు ప్రభుత్వం రహదారులు నిర్మించి, రవాణా సదుపాయం కల్పిస్తోందని చెప్పారు. కొండ్రుం వరకు తారురోడ్డు సదుపాయం కలుగుతోందని తెలిపారు. ఇంజరి కేంద్రంగా గత ఏడాది రాజ్‌మా విత్తనాలు, సిల్వర్ ఓక్ మొక్కలు పంపిణీ చేసినట్టు చెప్పారు. చింతగరువులో బోరు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్ఫూర్తి కార్యక్రమంలో 300 మంది గిరిజన యువతకు కోచింగ్ ఇచ్చి కానిస్టేబుల్ ఉద్యోగ రాత పరీక్షలకు పంపామని, ప్రేరణ కార్యక్రమం ద్వారా శిక్షణ అందించి బెంగళూరు లాంటి నగరాల్లో ఉద్యోగాలు కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ఉదయ్‌కుమార్, సీఐ సత్యనారాయణ,ఎస్ఐ మనోజ్‌కుమార్, సర్పంచులు,నాయకులు పాల్గొన్నారు. వైద్య శిబిరం, వాలీబాల్ టోర్నమెంట్‌కు వచ్చిన సుమారు 2 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రజలతో కలిసి ఏఎస్పీ భోజనం చేశారు. ఇంజరి,గిన్నెలకోట పంచాయతీలకు సెల్‌టవర్ సదుపాయం కల్పించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని స్థానికులు కోరారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన బొంగరం పంచాయతీ వంచుర్ల జట్టుకు రూ.25 వేలు నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో నిలిచిన ఇంజరి జట్టుకు 15 వేల నగదు, తృతీయ స్థానంలో నిలిచిన జి. మాడుగుల మండలం మండిభ జట్టుకు రూ.10 వేల నగదు బహుమతిని ఏఎస్పీ అందజేశారు. టీ షర్టులు, వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో దోమ తెరలు పంపిణీ చేశారు. ఇంజరిలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రి నుంచి వైద్యులు 510 మందికి వైద్య సేవలందించారు.

అక్రమాలకు తావులేకుండా సరకుల సరఫరా



సమావేశంలో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు,సిబ్బంది

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి

రంపచోడవరం: అక్రమాలకు తావులేకుండా నాణ్యమైన సరకులు సరఫరా చేయాలని, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్ రెడ్డి ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, 11 మండలాల సివిల్ సప్లై అధికారులు,ఎంఈవోలు, ఐసీడీఎస్ సీడీపీవోలు, అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లతో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్లలో మెనూ అమలు, సరకుల సరఫరా సంతృప్తికరంగా ఉన్నట్టు చెప్పారు. జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం ఆకలి మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాలం చెల్లిన నూనెలు, పాలు తదితర పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో పిల్లలకు సరఫరా చేయరాదని ఆదేశించారు. ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జిల్లా పరిధిలోని చింతూరు, రంపచోడవరం డివిజన్లలో ఎనిమిది మండలాల్లో నాలుగు జీసీసీ డీఆర్ డిపోలు, రెండు మండల లెవెల్ స్టాక్ పాయింట్లు, 11 అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరు పాఠశాలలు, 17 వసతిగృహాలను పరిశీలించినట్టు చెప్పారు. తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులు ఎక్కడైనా సరే సరకులు తీసుకునే వెసులుబాటు ఉందన్నారు. రేషన్ డిపో వద్ద, ఎండీయూ వాహనాలలో రేట్లతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా సరఫరా చేసే నిత్యావసర సరకులకు ఏ నెలకు ఆ నెల ప్రతిపాదనలు సమర్పించి అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లు, పాఠశాలలకు తాజావి సరఫరా చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సంబంధిత ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షించాలని తెలిపారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా ఫుడ్ కమిషన్ అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. 50 గ్రాముల బరువు గల గుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు వారానికి రెండు రోజుల పాటు 80 గ్రాముల పైనే తాజా కోడి మాంసం అందజేయాలని ఆదేశించారు. గుడ్లు సరిగా అందజేయని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఏజెన్సీలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో పాడైన మరుగుదొడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో తాను పరిశీలించినవన్నీ చాలా సంతృప్తికరమనిపించాయని చైర్మన్ తెలిపారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాల్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్‌ను ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి నెల సకాలంలో సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై డిప్యూటీ డైరెక్టర్ పి.సురేష్, జిల్లా సివిల్ సప్లై అధికారి ఆర్.శివప్రసాద్, జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్, డీఎంవో గణేష్ కుమార్, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ అనూష, ఏఎంవో సి.శ్రీహరి, జీసీసీ డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, సీడీపీవోలు సంధ్యారాణి, ప్రసన్నకుమారి, ఎంఈవోలు ఎం.సత్యనారాయణ దొర, మల్లేశ్వరరావు, ఏటిడబ్ల్యూవో రామతులసి, జీసీసీ మేనేజర్లు ముర్ల నాగరాజు రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

618 మందికి వైఎస్సార్ ఈబీసీ నేస్తం

- లబ్ధిదారుల ఖాతాల్లో రూ.92.70 లక్షలు జమ



లబ్ధిదారులకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద జిల్లాలోని అర్హులైన 618 మంది మహిళలకు ప్రయోజనం చేకూరింది. వారి ఖాతాల్లో రూ.92.70 లక్షలు బుధవారం జమ అయింది. ప్రకాశం జిల్లా మార్కాపురంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడేరు కలెక్టరేట్‌లో అధికారులు,ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సీఎం ప్రసంగాన్ని టీవీలో వీక్షించారు.అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్,ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర,బదిలీపై వెళుతున్న ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణలు వైఎస్సార్ ఈబీసీ నేస్తం ఆర్థిక సాయం చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని,చిన్నపాటి వ్యాపారాలతో ఆర్థికాభివృద్ధిని సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ,బీసీ కార్పొరేషన్ ఈవో శంకరరావులు పాల్గొన్నారు.

ఆ 17 గ్రామాలను తొలిదశలో చేర్చలేదు

- పోలవరం స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య




నిర్వాసితుల వినతులను పరిశీలిస్తున్న పోలవరం స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య

చింతూరు: ఇటీవల వీఆర్‌పురం, కూనవరం, చింతూరు మండలాల్లో గ్రామసభలు నిర్వహించిన 17 పోలవరం ముంపు గ్రామాలను తొలిదశ(41.15 కాంటూరు)లో చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్‌ఆదిత్య తెలిపారు. బుధవారం ఆయన చింతూరులో 'సాక్షి'తో మాట్లాడుతూ ఆ గ్రామాలన్నీ 45.72 కాంటూరు లెవల్లోనే ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే 41.15 కాంటూరు లెవల్లో ఉన్న గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియ పూర్తవడంతో 45.72 కాంటూరు లెవల్‌కు సంబంధించిన గ్రామాల్లో గ్రామసభల ప్రక్రియ ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. ఇకపై 45.72 కాంటూరు లెవల్లో ఉన్న గ్రామాలన్నింటిలో ముమ్మరంగా గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. బుధవారం చింతూరు వచ్చిన స్పెషల్ కలెక్టర్‌ను మల్లెతోట గ్రామస్తులు కలిశారు. తరచూ వరద ముంపునకు గురవుతున్న, గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన తమ గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చి పరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు. చింతూరులోని కొన్ని ప్రాంతాల్లో ప్రాథమిక నోటిఫికేషన్‌లో నమోదు కాని గృహాలను ముంపు జాబితాలో చేర్చి పరిహారం అందించాలని సర్పంచ్ కారం కన్నారావు కోరారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన పోలవరం నిర్వాసితులు స్పెషల్ కలెక్టర్‌కు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఆర్‌అండ్‌ఆర్ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ముంపు గ్రామాలకు సంబంధించిన గ్రామసభలు, సర్వేలు, డేటా నమోదు తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

డీఎస్సీ–98లో ఎంపికైన అభ్యర్థుల కల నెరవేరింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేయాలనే కోరిక తీరింది. పారదర్శకంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో కోరుకున్న పాఠశాలలో పని చేసే అవకాశం లభించింది. డీఈవో కార్యాలయ అధికారులు వారికి నియామక పత్రం అందించిన వేళ.. సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఇచ్చిన మాట మేరకు కొలువులిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జై కొట్టారు. 25 ఏళ్ల ఎదురుచూపులకు మోక్షం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు.

- డీఎస్సీ- 98 నియామకాలు మరూ..
- 355 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు
- కౌన్సెలింగ్‌లో కోరుకున్న చోట పోస్టింగ్



కోరుకున్న చోటు ఎంచుకొని సంతకం చేస్తున్న అభ్యర్థి

విశాఖ విద్య: ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎస్సీ–98లో ఎంపికైన ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన అభ్యర్థులకు బుధవారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. నిబంధనల మేరకు 355 మందిని అర్హులుగా తేల్చి, తొలి రోజు జాబితాలోని 1 నుంచి 200 మంది వరకు కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి, డీఈవో చంద్రకళ, అనకాపల్లి డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ పర్యవేక్షణలో ఒక్కో అభ్యర్థిని పిలిచి కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఖాళీల జాబితాను ముందుగానే ప్రకటించారు. 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యమిచ్చి ఖాళీల జాబితాను సిద్ధం చేశారు. దీంతో దాదాపుగా అందరికీ తమ నివాస ప్రాంతాలకు సమీప మండలాల్లోనే పోస్టింగ్‌లు లభించాయి. మిగిలిన వారికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

పిల్లలకు పాఠాలు చెప్పడం ఇష్టం



గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో పాలనాధికారిగా పనిచేస్తున్నాను. ఫ్యాక్టరీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నాను. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేయాలనేది చిరకాల కోరిక. పిల్లలకు పాఠాలు చెప్పటం అంటే మహా ఇష్టం. ఇన్నాళ్లకు ఆ కల నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే ఇది సాధ్యమైంది.

– పి.వెంకట రమణమూర్తి, గోవాడ, అనకాపల్లి జిల్లా

సీఎం జగన్ వల్లే ఈ ఉద్యోగం



డీఎస్సీలో అర్హత సాధించినా.. ప్రభుత్వ ఉద్యోగం దక్కలేదనే బాధ ఉండిపోయింది. ఇన్నాళ్లకు టీచర్‌గా పనిచేసే అవకాశం దక్కింది. ఇంకో ఆరేళ్లకు పైగానే ఉద్యోగం చేస్తాను. ఇంట్లో పిల్లలకు పాఠాలు చెప్పి, ప్రయోజకులుగా తీర్చిదిద్దుకున్నాను. ఇప్పుడు ప్రభుత్వ బడిలో పిల్లల అభివృద్ధికి పాటుపడతాను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం వల్లే మాకు ఉద్యోగాలు వచ్చాయి. అందుకే మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలి.

– పి.లక్ష్మి, మధురవాడ, విశాఖ జిల్లా

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



డీఎస్సీ–98లో ఎంపికైన వారి గురించి పట్టించుకుని, ఉద్యోగాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం. మా గురించి గతంలో ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇంకా తొమ్మిదేళ్లకు పైగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తాను. మా మండలంలోనే పోస్టింగ్ వచ్చినందుకు మరింత ఆనందంగా ఉంది.

– దొండా చిన వెంకన్నదొర, వీరవిల్ల అగ్రహారం, అనకాపల్లి జిల్లా

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:

ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
6-13	4-26

రంపచోడవరం:

6-28	4-28

న్యూస్‌రీల్

పిడుగుపాటుకు ఒకరి మృతి

- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



మృతి చెందిన జోయో



తీవ్రంగా గాయపడిన దొంబు

సాక్షి, పాడేరు: డుంబ్రిగుడ మండలంలో బుధవారం భారీ వర్షం పడింది.కండ్రుం పంచాయతీ ఉజ్జంగిలో పిడుగుపడి ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఉజ్జంగి గ్రామానికి చెందిన పాంగి జోయో పశువులు కాసేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లాడు. ఆ సమయంలో భారీ వర్షం కురవడంతో చెట్టు కిందకు చేరాడు. ఆ సమయంలో పిడుగు పడడంతో జోయో అక్కడికక్కడే మృతి చెందగా, సమీపంలో ఉన్న దొంబు అనే వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. వర్షం కారణంగా కించుమండ వారపు సంతకు వచ్చిన గిరిజనులు ఇబ్బందులకు గురయ్యారు. విక్రయానికి తీసుకొచ్చిన సరకులు తడిసిముద్దయ్యాయి.

ముత్యాలమ్మ జాతర పోస్టర్ల ఆవిష్కరణ



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 17 నుంచి 20 వరకు నిర్వహించనున్న ముత్యాలమ్మ జాతర పోస్టర్లను బుధవారం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారామ్, ఉత్సవ కమిటీ నాయకులు ఆవిష్కరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాతర ప్రశాంతంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు దురియా హేమంత్, ప్రధానకార్యదర్శి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ పుష్పలత, సీఐ రమేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రవి, ఎంపీటీసీలు దారలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

మత్స్యగెడ్డ వద్ద పర్యాటకుల సందడి



కుమ్మరిపుట్టు మత్స్యగెడ్డ ఒడ్డున పర్యాటకుల టెంట్లు

ముంచంగిపుట్టు: మండలంలో సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు,కొత్తసుజనకోట, మర్రిపుట్టు గ్రామాలను ఆనుకొని ఉన్న మత్స్యగెడ్డ పరీవాహిక ప్రాంతాల్లో రెండు రోజులుగా పర్యాటకులు సందడి చేస్తున్నారు. విజయవాడ,విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి టెంట్లు వేసుకున్నారు. సెల్ఫీలు,ఫొటోలు తీసుకుంటూ మత్స్యగెడ్డ అందాలను బంధించారు. ఉదయం సూర్యోదయాన్ని ఆస్వాదిస్తూ సందడి చేశారు.

క్రీడల్లో రాణించాలి



గిరిజన విద్యార్థులకు క్రికెట్ కిట్లను అందజేస్తున్న అశోక్‌కుమార్, బీరేంద్రకుమార్

గూడెంకొత్తవీధి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్ సహాయకమాండెంట్ బీరేంద్రకుమార్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సివిక్‌యాక్షన్ ప్రోగ్రాం బుధవారం జరిగింది.కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వాలీబాల్, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

క్లుప్తంగా

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారామ్

చింతపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పోషక ఆహారం అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయినగర్ వీధిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించిన ఆయన కేంద్రాల్లో చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందించకుంటే చర్యలు తప్పవన్నారు. కేంద్రం ద్వారా పోషకాహారం పొందుతున్న పలువురు బాలింతలు, గర్భిణులతో ఆయన ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సక్రమంగా అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సీడీపీవో రమ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీ కొట్టి వ్యక్తి మృతి



లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన వ్యక్తి

పాయకరావుపేట నామవరం గ్రామంలో జాతీయ రహదారి పై లారీ ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందినట్టు ఎడిషనల్ ఎస్.ఐ. సత్యనారాయణ తెలిపారు. నామవరం గ్రామానికి చెందిన ఇసరపు సూర్యారావు (81) రోడ్డు పక్కన వున్న టీ స్టాల్ వద్ద నిలుచుకుని ఉండగా తుని నుంచి నక్కపల్లి వైపు జాతీయ రహదారి పై అతివేగంగా ప్రయాణిస్తున్న లారీ కారును, కారు ముందు వున్న సూర్యారావును ఢీ కొట్టింది. సూర్యారావు లారీ చక్రం క్రింద పడిపోవడంతో తల భాగం పూర్తిగా నలిగిపోయి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు ఇసరపు తాతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

‘ఆసరా’తో ఆర్థికాభివృద్ధి



సమావేశానికి హాజరైన మహిళలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ, చిత్రంలో అధికారులు, నాయకులు

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆసరాతో పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో వెలుగు శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ మండలంలోని 160 మహిళ సంఘాలకు చెందిన 1896 మంది మహిళలకు రూ.40.35లక్షలు రుణాలు మంజూరైనట్టు చెప్పారు. వీటిని గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. అనంతరం మహిళలకు రూ.40లక్షల, 35వేల మెగా చెక్కును అందించారు. ఆదివాసులకు ఎటువంటి అన్యాయం జరగకుండా చర్యలు చేపడతామన్నారు. జెడ్పీటీసీ రేగం మత్యలింగం, వెలుగు డీపీఎం వైకుంఠరావు, అరుకు క్లస్టర్ ఏరియ కో–ఆర్డినేటర్ కృష్ణారావు,ఏపీఎం చిన్నారావు, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు శామ్యేల్, వైస్ ఎంపీపీ ప్రియాంక, ,సర్పంచ్‌లు వెంకట పూర్ణిమ, సాంబ, ఆర్‌ఐ రంగారావు, నాయకులు భూషణ్,కోటిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాలతో గాంధీజీ కలలు సాకారం



చౌడుపల్లి సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయాలతో సాకారమవుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీలో బుధవారం 1–2 నూతన సచివాలయ భవనాలను ఆమె బుధవారం ప్రారంభించారు. ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చి గ్రామ స్వరాజ్యం సాధించాలన్న గాంధీజీ ఆశయం జగనన్న ఆలోచనతో సాధ్యమవుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, పలు రాష్ట్రాలు ఈ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని ప్రగల్భాలు పలుకుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు తన హయాంలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకం అమలుచేయకపోవడం దురదృష్టకరమన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ప్రజలకు వరమన్నారు. ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ లలిత, ఎంపీటీసీ సభ్యురాలు మీనా, మార్కెట్ యార్డ్ ఛైర్ పర్సన్ రాజులమ్మ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు పుష్పలత, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి తదితరులు పాల్గొన్నారు.

పోషణ యాజమాన్యం కీలకం



హాజరైన ఏవోలు,వ్యవసాయ అసిస్టెంట్‌లు

- జిల్లా వ్యవసాయాధికారి నందు

సాక్షి,పాడేరు: భూమిలో పోషకాల స్థాయిని బట్టి ఎరువుల వినియోగిస్తే సాగు ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధ్యమవుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు సూచించారు. జిల్లాలోని 22 మండలాల వ్యవసాయాధికారులు, సచివాలయాల్లోని వ్యవసాయ అసిస్టెంట్లకు కలెక్టరేట్‌లో బుధవారం భూసార పరీక్షలపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో పోషణ యాజమాన్యం కీలకమన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో భూసార పరీక్షలు నిర్వహించేందుకు వ్యవసాయశాఖ కృషి చేస్తోందన్నారు. మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షా కేంద్రానికి పంపుతున్నామని, పంటలను తరచూ పరిశీలించడం ద్వారా భూమిలో పోషక లోపాలను గుర్తించి, ఆయా రైతులకు తెలియజేయాలని తెలిపారు. సేంద్రియ పంటల సాగును ప్రోత్సహించి,దిగుబడులు తగ్గకుండా చూడాలని ఆయన సూచించారు.ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ జగన్నాథం,డాక్టర్ వెంకటరావులు భూసార పరీక్షల నిర్వహణ,ఫలితాల విశ్లేషణ,ఎరువుల వినియోగం,సేంద్రియ పద్ధతులు,అధిక దిగుబడులపై సమగ్ర అవగాహన కల్పించారు.

హైవే పనులకు సర్వే



అటవీ భూ భాగాన్ని పరిశీలిస్తున్న అటవీ, రెవెన్యూ, మండల ప్రజాపరిషత్ అధికారులు, సిబ్బంది

రాజవొమ్మంగి: మండలం మీదుగా రూపుదిద్దుకొంటున్న ఎన్‌హెచ్ 516 ఈ రహదారి నిర్మాణం కోసం 12.19 హెక్టార్ల అటవీభూమి అవసరం అని గుర్తించినట్లు తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి, అటవీ క్షేత్రాధికారి అబ్బాయిదొర, ఎంపీడీఓ బాపన్నదొర విలేకరులకు తెలిపారు. నేషనల్ హైవేలో కలసిపోతున్న అటవీభూమిని గుర్తించేందుకు మండల ప్రజాపరిషత్, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి చేరువగా ఉన్న ప్రజలతో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఎంత భూ భాగం అవసరం అనే అంశంపై కంబైన్డ్ సర్వే చేపట్టారు. హైవే నిర్మాణంలో జడ్డంగి గ్రామ శివార్లలో 0. 31 హెక్టార్లు, రాజవొమ్మంగి శివారు సూరంపాలెం టేకు వనాలు మీదుగా 3.82 హెక్టార్లు, దాకరాయి గ్రామ సమీపాన 8.06 హెక్టార్ల అటవీభూమి కలసిపోతున్నట్లు గుర్తించామని తహసీల్దార్ వైవీ. సుబ్రహ్మణ్యాచారి, ఎంపీడీఓ బాపన్నదొర, అటవీక్షేత్రాధాకిరి అబ్బాయిదొర తెలిపారు.

ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు



ఓపీ చీటిలకు బారులు తీరిన ప్రజలు

- జిల్లా ఆస్పత్రికి రోగుల తాకిడి
- వాతావరణ మార్పులతో వైరల్ జ్వరాలు అధికం

సాక్షి,పాడేరు: మన్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వేకువజామున దట్టంగా పొగమంచు,మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత,సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షాలతో మన్యంలో విభిన్న వాతావరణం నెలకొంది. వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రజల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో 300 నుంచి 400 వరకు రోజువారీ ఓపీ నమోదవుతోంది. పాడేరుతో పాటు జి.మాడుగుల,ముంచంగిపుట్టు, అరకులోయ, డుంబ్రిగుడ,హుకుంపేట, పెదబయలు,చింతపల్లి ప్రాంతాల నుంచి జ్వరపీడితులు భారీగా జిల్లా ఆస్పత్రికి వచ్చి, వైద్యసేవలు పొందుతున్నారు. సిబ్బంది సకాలంలో రక్తనమునాలు సేకరించి, పరీక్షలు జరుపుతున్నారు. వాతావరణ మార్పులు,నీటి కాలుష్యం కారణంగా టైఫాయిడ్,వైరల్ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు తెలిపారు. ప్రతి రోగికి సత్వర వైద్యం అందిస్తున్నామన్నారు.అత్యవసర కేసులకు శస్త్రచికిత్సలు జరుపుతున్నాం, పుష్కలంగా మందులు ఉన్నాయని ఆయన చెప్పారు. అనారోగ్యంతో బాధపడే రోగులు సకాలంలో ఆస్పత్రికి వచ్చి వైద్యసేవలు పొందవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



వెంకట నాయుడు (ఫైల్)

నర్సీపట్నం : మున్సిపాలిటీ బలిఘట్టం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. టౌన్ సీఐ గణేష్ అందించిన వివరాలు...నర్సీపట్నం శివపురంకు చెందిన కె.వెంకటనాయుడు(27) చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వారం రోజుల క్రిత నర్సీపట్నం వచ్చాడు. ఈ నెల 11వ తేదీన నర్సీపట్నం మండలం మెట్టపాలెంలో జరిగిన పండగకు బంధువుల ఇంటికి వెళ్ళాడు. అదే రోజు రాత్రి ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వస్తుండగా బలిఘట్టం వద్ద పంది అడ్డు రావడంతో తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుండపోత



పాడేరులో కురుస్తున్న భారీ వర్షం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో రోజూ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కుండపోతగా వర్షం కురుస్తోంది.బుధవారం పాడేరు,హుకుంపేట, జీకే వీధి ప్రాంతాలలో ఈదురుగాలులతో భారీ వర్షం పడింది.పాడేరులో గంట పాటు కురిసిన వర్షంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.జీకే వీధి మండలం మారుమూల జర్రెలలో వడగాళ్లతో భారీ వర్షం పడింది.

గ్యాస్ స్టౌ నుంచి మంటలు



ఇంట్లో దగ్ధమైన కరెంటు వైర్లు బోర్డు, గ్యాస్ బండ నుంచి వ్యాప్తిస్తున్న మంటలు

- దగ్ధమైన ఇంట్లో సామగ్రి
- రూ. 2 లక్షల మేరకు అస్తి నష్టం జరిగినట్టు అంచనా

నాతవరం : గ్యాస్ స్టౌ నుంచి మంటలు వ్యాప్తించి ఇల్లంతా దగ్ధం కావడంతో సుమారుగా రూ. 2 లక్షలు ఆస్తి నష్టం జరిగింది, మండలంలో మన్యపురట్లలో సిహెచ్.పాములమ్మ ఉదయం నుంచి బయట వృత్తి పనులు చేసుకోని ఇంటికి వచ్చి మధ్యాహ్న సమయంలో వంట చేయడానికి గ్యాస్ స్టౌ వెలిగించగా ఒక్కసారిగా మంటలు వ్యాప్తించాయి. దీంతో భయంతో పాములమ్మ కేకలు వేసుకుంటూ బయటకు వచ్చేసింది. స్థానికులు వచ్చి చూసేసరికి గ్యాస్ స్టౌ నుంచి వ్యాప్తించిన మంటలతో ఇంట్లో సామాగ్రి దగ్ధమవుతున్నాయి. గ్యాస్ బండను స్థానికులు ఇంట్లోంచి బయటకు తరలించారు. అప్పటికే ఇంట్లో ఉన్న దుస్తులు టీవీ, ఫ్రిజ్ ఇతర నిత్యవసర సామాగ్రి కళ్ల ముందే కాలిపోవడంతో బాధితురాలు భోరున విలపించింది. సర్వం కోల్పోయిన పాములమ్మకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్తా మహేష్ మనో ధైర్యం కల్పించి తహసీల్దార్ పి, కనకరావుకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ అధికారులు వచ్చి అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టాన్ని పరిశీలించారు.

బైక్ అదుపు తప్పి బీటెక్ విద్యార్థి దుర్మరణం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో మృతిచెందిన నాని



నాని మృతదేహం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం–చోడవరం రోడ్డులోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం సమీపంలో బుధవారం అర్ధరాత్రి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోలుగుంట మండలంలోని అడ్డసార శివారు మర్రిపాలెం గ్రామానికి చెందిన కూరాకుల చిన్నబ్బాయి చిన్న కుమారుడు నాని(21)తగరపువలసలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చిన అతడు బుధవారం రాత్రి బైక్‌పై తగరపువలసలోని కళాశాలకు తిరిగి వెళ్తున్నాడు. ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం వద్ద బైక్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ బలంగా ఢీకొనడంతో హెల్మెట్ నుజ్జునుజ్జు అయి తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుని సోదరుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మండిపోతున్న ఎండలు



ముంచంగిపుట్టులో ఎండ తీవ్రతతో గొడుగులతో వస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ వేడితో జనం అల్లాడుతున్నారు. చెట్లనీడను ఆశ్రయించి ఉపశమనం పొందుతున్నారు. మండల కేంద్రంలో శీతలపానీయాల వ్యాపారం జోరు అందుకుంది.


జూలో అందుబాటులోకి కొత్త బ్యాటరీ వాహనాలు



జూలో బ్యాటరీ వాహనాలు ప్రారంభిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి

ఆరిలోవ: ఇందిరా గాంధీ జులాజికల్ పార్కులో కొత్త బ్యాటరీ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. కొన్నాళ్లుగా ఇక్కడ రెండు బ్యాటరీ వాహనాలు మాత్రమే సేవలు అందిస్తున్నాయి. తాజాగా మరో 10 వాహనాలను సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూలో బ్యాటరీ వాహనాలను ఎక్కువ సంఖ్యలో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వీటి వల్ల శబ్దం, పొగ ఉండదని, కార్బన్ తీవ్రత తగ్గుతుందన్నారు. ఒక్కో వాహనంలో 10 మంది కూర్చుని జూలో వన్యప్రాణులను తిలకించవచ్చునని చెప్పారు. పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.50 చొప్పున టికెట్ ధర నిర్ణయించామన్నారు. జూ ప్రధాన ద్వారంతో పాటు సాగర్‌నగర్ వైపు ద్వారం కూడా ఈ వాహనాలు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూ అధికారులు పాడేరు, అనకాపల్లి డీఎఫ్‌వోలు వినోద్‌కుమార్, లక్ష్మణ్, ఏసీఎఫ్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు పాల్గొన్నారు.

రైలు ఢీ కొట్టి వ్యక్తి మృతి



రైలు ఢీ కొట్టి మృతి చెందిన వ్యక్తి

పాయకరావుపేట : రైలు ఢీ కొట్టి వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వేపోలీసు ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీ కొట్టడంతో గుర్తు తెలియని 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. గుల్లిపాడు సమీపాన బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఘటన జరిగిందన్నారు. మృతుడు వంగపువ్వు రంగు టీషర్టు, నిక్కరు ధరించి వున్నాడన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సిటీలో షూటింగ్‌ల సందడి



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న అల్లు అర్జున్

కొమ్మాది: ప్రముఖ కథానాయకుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ బుధవారం విశాఖ చేరుకున్నారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పుష్ప–2 సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను పోర్టు తదితర ప్రాంతాల్లో చిత్రీకరించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నగరానికి చేరుకున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ నాలుగు రోజుల పాటు ఇక్కడ జరుగుతుందని సమాచారం.

సైంధవ్ వచ్చేశాడు

హిట్ దర్శకుడు శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా సినిమా ‘సైంధవ్’ చిత్రీకరణ గురువారం నుంచి నగరంలో ప్రారంభం కానుంది. ఈ సినిమాలో హీరోగా నటిస్తున్న విక్టరీ వెంకటేష్ నగరానికి చేరుకున్నారు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణ్ సంగీతం అందిస్తుండగా.. వెంకట్ బోయనపల్లి నిర్మాత. భీమిలి బీచ్ రోడ్డు కొబ్బరితోట వద్ద వెన్నెల కిశోర్ ప్రధాన పాత్ర పోషిస్తున్న సినిమా చిత్రీకరణ జరుగుతోంది. రాజారామ్మోహన్ రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలను మరో రెండు రోజుల పాటు ఇక్కడ చిత్రీకరించనున్నారు.

ఇండస్ట్రియల్ పాలసీపై అవగాహన



మాట్లాడుతున్న డీఐసీ జీఎం గణపతి

అక్కిరెడ్డిపాలెం: ఇండస్ట్రియల్ పాలసీపై పారిశ్రామికవేత్తలకు ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని.. ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా పరిశ్రమల కేంద్రం(డీఐసీ) జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతి అన్నారు. ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్(వాసీవా)లో బుధవారం ఇండస్ట్రియల్ పాలసీపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు, అనుమానాలను నివృత్తి చేశారు. వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. అనంతరం డీఐసీ జీఎం గణపతిని వాసీవా, ఐలా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ, డీఐసీ ఏడీ కరుణాకర్, ఎంఎస్ఎంఈ ఏడీ కుమార్, వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, ఉపాధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, కార్యదర్శి డి.వినోద్, ఐలా మాజీ ప్రతినిధులు శేషగిరిరావు, కిశోర్ పాల్గొన్నారు.

ఉద్దండపురం వద్ద రోడ్డు ప్రమాదం



కాలువిరిగిన రాము



గాయాలైన సీతారామయ్య

నక్కపల్లి: జాతీయరహదారిపై బుధవారం ఉద్దడపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గ్రామానికి చెందిన రాము బైకుపై వెళ్తుండగా వెనుక నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రాము కాలు విరిగింది. ఇదే కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టింది. ముందు కారులో కూర్చున్న విశాఖపట్నంకు చెందిన సీతారామయ్యకు గాయాలయ్యాయి. వారిని తుని ఏరియా ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బైక్ ఎక్కి... బరిసెలు పట్టి



అడవికి వేట కోసం బైకుపై వెళ్తున్న గిరిజనులు.

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో ఇటుకల పండగ సందడి నెలకొంది.గత వారం రోజులుగా మహిళలు గ్రామాల్లో దారులకు అడ్డగా తాళ్ల,కర్రలు అడ్డు పెట్టి తాసేరు వసూలు చేస్తూ ఉండగా మగవారంతా అడవికి వేటకు వెళుతున్నారు. ప్రస్తుతం గిరిజన ప్రాంతంలో అడవులు అంతరిస్తున్నాయి.సుదూర ప్రాంతాల్లో ఉన్న అడవులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అడవులను చేరుకునేందుకు కొన్ని గ్రామాల్లో గిరిజనులు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బుధవారం పనసపుట్టు పంచాయతీ లుక్కురు గిరిజనులు బల్లెలు పట్టుకొని ఇలా బైకుపై వేటకు పయనం అయ్యారు.ఈ చిత్రాన్ని ‘సాక్షి’ క్లిక్ మనిపించింది.